క్లుప్తంగా

పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

సూర్యాపేట : ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాల సూర్యాపేట నందు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్, సివిల్, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లలో సీట్లు ఉన్నాయని తెలిపారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ఆగస్టు 1 నుంచి 10 వరకు కళాశాలలో సమర్పించాలని సూచించారు. ఆగస్టు 11న అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని, విద్యార్థులకు హాస్టల్ సదుపాయం ఉందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ : 98663 85292, 82474 57629, 93947 44491లను సంప్రదించాలని తెలిపారు.

వృద్ధులకు బియ్యం పంపిణీ



బియ్యం అందిస్తున్న ఫాదర్, సిస్టర్లు

ఆత్మకూర్(ఎస్) : సీఎల్ ఏపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని ఆర్సీఎం చర్చిలో వృద్ధులకు బియ్యం అందించారు. సీఎల్ ఏపీ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యక్షులు చింతపల్లి రజిని పుట్టినరోజు సందర్భంగా నెమ్మికల్లు గ్రామానికి చెందిన పలువురు వృద్ధులకు 25 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్సీఎం చర్చి ఫాదర్ పసల గ్రేగరి, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చింతపల్లి రాజేష్, సిస్టర్ జైస్, రజిని, కిరణ్, నవీన్, శంకర్, మహేష్, శశికుమార్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో హోమం

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని చాయా సమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో కాకులారపు రజిత, గణపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్‌రావు, కె.సత్యనారాయణ, మణికంఠ, గిరి, బెలిదె లక్ష్మయ్య, అర్చకులు భీంపాండే, మోనూపాండే, శ్రీరాంపాండే, భక్తులు పాల్గొన్నారు.

కుంకుమార్చన పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : శ్రావణ మాసం సందర్భంగా అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం కుంకుమార్చన పూజలు నిర్వహించారు. శ్రావణమాసం పూర్తయ్యే వరకు ఆలయంలో ప్రతిరోజు ప్రత్యేక పూజలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అర్చకులు కోరారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, రామకృష్ణ చక్రవర్తి పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



తిరుమలగిరిలో బోనాల పండుగలో పాల్గొన్న మార్కెట్ చైర్‌పర్సన్ చామంతి

తిరుమలగిరి : మున్సిపాలిటీలో బోనాల పండుగ సందర్భంగా ఆదివారం ముత్యాలమ్మకు విశ్వబ్రాహ్మణులు తొలి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చామంతి నరేష్, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్థికసాయం అందజేత

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండల పరిధిలోని నెమ్మికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు తమ తోటి విద్యార్థి గోలి ఉపేందర్‌కు ఆదివారం రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. నెమ్మికల్ గ్రామానికి చెందిన గోలి ఉపేందర్ ఇటీవల ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా మిత్రులంతా కలిసి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంద్యాల సైదులు, మహేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

సమస్యల నిలయం.. స్నేహనగర్



స్నేహనగర్‌లోని ఓ ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు మొలిచి, నిలిచిన మురుగు

- డ్రెయినేజీలు లేక కాలనీలో ఇళ్ల ఎదుటే నిలుస్తున్న మురుగు
- చెత్తాచెదారంతో నిండుతున్న ఖాళీ ప్రదేశాలు.. విజృంభిస్తున్న దోమలు
- వీధిలైట్లు వెలగక అంధకారంతో స్థానికులకు ఇబ్బందులు



స్నేహనగర్‌లో డ్రెయినేజీ లేకుండా ఉన్న రోడ్డు

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట మున్సిపాలిటీలోని స్నేహ నగర్ కాలనీ ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. కొత్తగా ఏర్పడిన కాలనీ కావడంతో అధికారులు పట్టించుకోవడం లేదని, కనీస సౌకర్యాలైన రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ లేక నరకయాతన అనుభవిస్తున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మురుగుకూపాలుగా ఖాళీ స్థలాలు..

కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఇళ్ల నుంచి వెలువడే మురుగునీరు ఖాళీ ప్లాట్లలోకి చేరుతోంది. దీంతో ఆ ప్లాట్లు చిన్నపాటి చెరువులుగా మారిపోయాయి. దీనికి తోడు, కొందరు స్థానికులు చెత్తను కూడా అక్కడే పడేస్తుండటంతో ఆ ప్రాంతమంతా దుర్వాసనతో నిండిపోయింది. ఈ అపరిశుభ్రత కారణంగా దోమల బెడద పెరిగి, చాలామంది ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కాలనీలోని ఖాళీ స్థలాల్లో పెరిగిన సర్కారు చెట్లు, జమ్మి మొక్కలు పందులకు నివాసాలుగా మారాయి. ఈ సమస్యలపై ప్లాట్ల యజమానులు కూడా పట్టించుకోవడం లేదని, మున్సిపల్ అధికారులు జోక్యం చేసుకుని ప్లాట్ల యజమానులకు నోటీసులు జారీ చేసి, వాటిని శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

వీధి దీపాలు వెలగక భయం భయం..

స్నేహ నగర్‌లోని చాలా వీధుల్లో ఇప్పటికీ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయలేదు. కొన్నిచోట్ల ఏర్పాటు చేసినా అవి తరచుగా రిపేర్లకు వస్తున్నాయి. రాత్రి పూట కాలనీలోని చాలా ప్రాంతాలు అంధకారంలో మునిగిపోవడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఖాళీ స్థలాల నుంచి విష సర్పాలు తరచుగా బయటకు వస్తుండటంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు కూడా ఈ కాలనీకి అందకపోవడంతో ప్రజలు తాగునీటి సమస్యలను కూడా ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కాలనీలోని మౌలిక సదుపాయాలైన రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలి



ఖాళీ ప్లాట్లలో మురుగునీరు నిలువడం వల్ల దోమలు పెరిగి రాత్రిపూట చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇళ్ల నుంచి వచ్చే నీరు, వర్షపు నీరు కలిసి చిన్నపాటి చెరువుల్లా మారుతున్నాయి. ఖాళీ ప్లాట్లలో మురుగు పేరుకుపోయి, పందులు సంచరిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు ఈ ప్లాట్ల యజమానులతో మాట్లాడి వాటిని శుభ్రం చేయించాలి. అలాగే, యజమానులు తమ ప్లాట్ల చుట్టూ ప్రహరీలు లేదా రక్షణ కంచెలు ఏర్పాటు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కనకటి రవి, స్నేహనగర్

సైడ్ కాల్వలు నిర్మించాలి



మా కాలనీలో సరైన సైడ్ కాల్వలు లేకపోవడం వల్ల ఇళ్లలోని మురుగు నీరు ఖాళీ స్థలాల్లో నిలిచిపోతోంది. అంతర్గత రోడ్లు కూడా లేకపోవడంతో వర్షాకాలంలో చాలా కష్టాలు ఎదుర్కొంటున్నాం. మున్సిపల్ అధికారులు అంతర్గత రోడ్లతో పాటు సైడ్ కాల్వలు నిర్మించి, ఖాళీ ప్లాట్లలో నీరు నిలవకుండా చూడాలి. అలాగే, తాగునీటి సరఫరా కోసం పైపులైను కూడా వేయించాలి.

– కారంగుల సైదులు, స్నేహనగర్

ప్రతి ఒక్కరూ యోగా నేర్చుకోవాలి



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఉగ్గం సమన్విత

సూర్యాపేట : ఆరోగ్యమే మహాభాగ్యమని, అందుకు ప్రతి ఒక్కరూ యోగా నేర్చుకోవాలని చందూరు డీఆర్‌డీఓ వందనపు శ్రీదేవి అన్నారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో పది సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల వయస్సు వారికి యోగా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి మాట్లాడారు. జిల్లాలోని ఔత్సాహికులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు యోగా శిక్షణను ఇచ్చి ఆరోగ్యవంతమైన భారత్‌ను నిర్మించడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వివిధ విభాగాల్లో ఉగ్గం సమన్విత, కీత శ్రీకార్తీకేయ వర్మ, జి.వైష్ణవి, తోకల మహేశ్వరి, గారిడాచలం బానుప్రసాద్, సంగబోయిన బిందు, దేశగాని ఉప్పలయ్య, గూడూరు నాగేశ్వర్ రావు, కీత శ్రీనివాస్ రావులు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి సూర్యాపేట ఎంఈఓ శేషగాని శ్రీనివాస్ గౌడ్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ రావు, పీడీ అయితగోని శ్రీనివాస్, అసోసియేషన్ కార్యదర్శులు జుట్టుకొండ నవీన్, రవిరాల చంద్రశేఖర్, బానుప్రకాష్, రంగారావు, ఉప్పలయ్య, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, యోగా సాధకులు తదితరులు పాల్గొన్నారు.

వికసిత గ్రామీణ భారతం బీజేపీతోనే సాధ్యం



మాట్లాడుతున్న రామచంద్రయ్య

తిరుమలగిరి : గ్రామీణ ప్రాంత రైతుల అభ్యున్నతి, అభివృద్ధి కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు కడియం రామచంద్రయ్య అన్నారు. ఆదివారం తాటిపాములలో ఇంటింటికీ బీజేపీ ప్రభుత్వ విజయాలు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. గ్రామీణ వికసిత భారత్ బీజేపీతోనే సాధ్యమని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో రూ.4,948 కోట్లతో 12,800 కిలోమీటర్ల రోడ్లు నిర్మించిందని తెలిపారు. 17 లక్షలకు పైగా వీధి దీపాలు, 100శాతం ఇళ్లకు మరుగుదొడ్ల నిర్మించిందని అన్నారు. దేశవ్యాప్తంగా ఉచిత బియ్యం పంపిణీ చేస్తూ.. పేదల ఆకలి తీర్చుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మూల వెంకటరెడ్డి, చిర్రబోయిన హనుమంతు, అంజయ్య కుమార్, నక్క నాగరాజు, పాక మహేష్, అవిలయ్య, హరీష్ పాల్గొన్నారు.

వాన రాకపాయే.. సాగు భారమాయే!

- నేటికీ వాగులు పారేలా కురవని వాన
- వట్టిపోతున్న చెరువులు, కుంటలు
- బోరుబావుల్లోనూ జలాలు లేక ఆందోళన చెందుతున్న రైతులు



నీరులేక వెలవెలబోతున్న భీమునికుంట చెరువు

ఆత్మకూర్ (ఎస్) : వానాకాలం సీజన్ ప్రారంభమై దాదాపు 50 రోజులు కావొస్తున్నా.. సరైన వర్షాలు లేకపోవడంతో మండలంలో రైతులు అయోమయంలో ఉన్నారు. మండల వ్యాప్తంగా నేటి వరకు పెద్ద వర్షాలు కురవలేదు. కేవలం మోస్తరు వర్షాలే వస్తుండడంతో నేటి వరకు మండలంలోని చెరువులు, కుంటలకు నీరు చేరలేదు. దీంతో భూగర్భ జలాలు తగ్గి బోరుబావులు వట్టిపోతున్నాయి. ఈ నేపథ్యంలో వరి సాగు అంతంత మాత్రంగానే జరుగుతోంది. ఇప్పటివరకు కేవలం 40 శాతం మేర వరినాట్లే పూర్తయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఏటా ఇదే సమయానికి చివరి దశలో ఉండే వరినాట్లు.. ఈ యేడు ఇంకా చాలా ప్రాంతాల్లో ప్రారంభమే కాలేదు. మొత్తానికి ఈసారి వరి సాగు 50 శాతానికి మించేలా లేదు. వర్షాలు లేకపోవడంతో మెట్టపంటలైన పత్తి, వేరుశెనగ, పెసర, కంది పంటలు కూడా ఆశాజనకంగా ఎదగడం లేదు. దీంతో దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

నాన్ ఆయకట్టు నుంచి.. వరి సాగు వైపు

ఆత్మకూరు మండలం మొదటి నుంచి నాన్ ఆయకట్టు ప్రాంతం. ఇక్కడ బోరుబావుల కింద మాత్రమే వరి అత్యధికంగా సాగయ్యేది. నీటి వసతి లేని ప్రాంతాల్లో మెట్టపంటలైన పత్తితో పాటు పెసర, వేరుశనగ, కంది పంటలు సాగయ్యేవి. అయితే 2018 నుంచి ప్రభుత్వం ఎస్సారెస్పీ రెండో దశ కింద రెండు పంటలకు నీళ్లు ఇస్తుండటంతో రైతులు పత్తి, ఇతర పంటలను సాగు చేయడం మానేశారు. భూములన్నింటినీ వరి సాగుకు అనుకూలంగా మార్చుకుని ఎస్సారెస్పీ నీటితో వరి పంటలను పండిస్తున్నారు.

వర్షాలు సరిగా లేకపోవడంతో..

వరిసాగు వైపు మళ్లిన రైతులకు మళ్లీ ఇబ్బందులు మొదలయ్యాయి. గతేడాది నుంచి వర్షాలు ముఖం చాటేయగా.. ఎస్సారెస్పీ నీళ్లు కూడా అందకపోవడంతో రైతులు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. భూగర్భ జలాలు కూడా అడుగంటి బోర్లు అంతంత మాత్రంగానే పోస్తున్నాయి. వరుణుడు కరుణించకపోవడంతో ఓ వైపు చెరువులు, కుంటలు కూడా వట్టిపోయాయి. కనీసం చెరువులు, కుంటలను నింపేందుకైనా ఎస్సారెస్పీ నీటిని విడుదల చేస్తే బోరుబావుల్లో భూగర్భ జలాలు పెరిగి కొంతైనా సాగుకు ఉపయోగపడుతుందని రైతులు భావిస్తున్నారు.

ఐదు ఎకరాలు ఎండుతోంది



ఇటీవల కురిసిన వర్షానికి ఆత్మకూరులో ఐదు ఎకరాలలో పొలం దున్నాను. అయితే మళ్లీ వర్షం రాలేదు. దీంతో దున్నిన దుక్కి ఎండిపోతోంది. ఇప్పటివరకు నాటు పెట్టలేదు. నారు ముదిరిపోయే దశకు వస్తోంది. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి బోర్లు పోసే పరిస్థితి లేదు. మూడు బోర్లు ఉన్నా అవి అంతంతమాత్రంగానే పోస్తున్నాయి.

– కొప్పుల శ్రీనివాస్‌రెడ్డి, రైతు

బోర్లు అంతంతమాత్రంగానే పోస్తున్నాయి



చెరువుల్లో నీళ్లు లేకపోవడం, వర్షాలు కురవకపోవడంతోపాటు ఎస్సారెస్పీ నీరు రాకపోవడంతో భూగర్భ జలాలు పూర్తిగా పడిపోయాయి. దీంతో బోర్లు పోసే పరిస్థితి లేదు. గతంలో నాలుగు ఎకరాలు సాగు చేసే రైతు ప్రస్తుతం బోర్ల కింద 20 గుంటలు సాగు చేసే పరిస్థితి లేదు.

– మెట్టు పుల్లారెడ్డి, రైతు

శ్రీవేంకటేశ్వర ఆలయంలో పవిత్రోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం రెండవ రోజు అగ్ని ప్రతిష్ఠ, మూల మంత్ర హోమాలను శ్రీపాంచరాత్ర ఆగమ పండితులు, యజ్ఞాచార్యులు నల్లాన్ చక్రవర్తుల హరిచరణ్ ఆచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. యాగశాలలో ద్వార, తోరణ, ధ్వజ, కుంభ ఆరాధనలు జరిపారు. నిత్య పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరెడ్డి, అర్చకులు సంకర్షణచార్యులు, శ్రీహరి ఆచార్యులు, ఫణికుమార్ ఆచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆదినారాయణ



ఆదినారాయణను సన్మానిస్తున్న సభ్యులు

సూర్యాపేట : పట్టణ ట్రాక్టర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాందేని ఆదినారాయణ రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని ఆదిత్య ట్రాక్టర్ గ్యారేజీలో ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ తనను రెండవసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు అనుముల పుల్లయ్యచారి, సుంకు కృష్ణ, ఎస్‌కే యూసుఫ్, రావిపహాడ్ శ్రీనివాసరావు, కుంచారపు నాగిరెడ్డి, బంధనాదం రాజు, గౌరవ సలహాదారులు పాల్గొన్నారు.

కుటుంబ సంక్షేమ నిధి చెక్కు పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్ : రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి షేక్ సయ్యద్ ఆత్మకూర్ (ఎస్) మండలం రామన్నగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఇటీవల గుండెపోటుతో మరణించారు. ఆదివారం ఆయన సంస్మరణ సభ సందర్భంగా కుడకుడలో టీఎస్ యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి నుంచి రూ.6లక్షలను బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నన్నెబోయిన సోమయ్య, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ రాములు, రాష్ట్ర చైర్మన్ ఎం.రాజశేఖర్ రెడ్డి, కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, వైస్ చైర్మన్ ఎస్.అనిల్‌కుమార్, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ జె.యాకయ్య, పౌర స్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కేఏ మంగ, జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా కోశాధికారి జి. వెంకటయ్య, దామోదర్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మద్దిరాల : పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలో భాగంగా ఎమ్మెల్యే మందుల సామేల్ సోమవారం మండలంలో పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల కేంద్రంలో రేషన్‌కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీతోపాటు మండల పరిధిలోని కుక్కడం, గుమ్మడవెల్లి గ్రామలలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోసే కార్యక్రమాలను ఆయన ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం గుమ్మడవెల్లిలో రూ.317.28 లక్షలతో మంజూరైన 33బై11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిపాల వెంకన్న, జిల్లా కార్యదర్శి బొబ్బిలి వెంకన్న, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మార్త కృష్ణమూర్తి, మద్దెల రాములు, మద్దెల భిక్షపతి, మాన్‌సింగ్, కోడి శ్రీశైలం, చామకూరి శ్రీనివాస్, దగ్గుల మల్లయ్య పాల్గొన్నారు.

వర్షాల కోసం వరదపాయసం, జలాభిషేకం



కొమ్మాలలో జలబిందెలతో ఊరేగింపుగా వెళ్తున్న యాదవులు

అర్వపల్లి : వరుణదేవుడు కరుణించి వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ కొమ్మాలలో ఆదివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో వరదపాయసం, జలాభిషేకం నిర్వహించారు. యాదవులు జలబిందెలతో ఊరేగింపుగా గంగదేవమ్మ ఆలయానికి వెళ్లి దేవతకు జలాభిషేకం చేసి వరదపాయసం పోశారు. ఈ కార్యక్రమంలో మర్యాద వీరయ్య, కుంటిగొర్ల శ్రీను, బడుగుల సోమయ్య, బయ్య గంగయ్య, పి.సోమయ్య, కె.వీరస్వామి, రాములు, శ్రీను, యాదవులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు అండ

అర్వపల్లి : ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు అండగా ఉంటుందని జాజిరెడ్డిగూడెం ఉమ్మడి మండల పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి అన్నారు. జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన బత్తుల వీరయ్యకు వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే మందుల సామేల్ ద్వారా మంజూరైన రూ.23 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఆదివారం బాధితుడికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వల్లపు సాయిలు, మాదం వీరారెడ్డి, వెంకటాద్రి, నర్సింహ, మల్లారెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, రాములు, ప్రవీణ్ తదితరులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ.. రికార్డుల పరిశీలన



పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, స్టేషన్ పరిసరాల ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ యువత మత్తు, గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని, వాటి నివారణకు పోలీసు సిబ్బంది ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు ఎప్పటికప్పుడు వివరించాలని, నేరాలను అదుపులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. సోషల్ మీడియాలో వ్యక్తి ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా పోస్టులు పెట్టే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ గోపికృష్ణ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



మోరిశెట్టి అంతయ్య మెమోరియల్ ప్రభుత్వ పాఠశాలలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

సూర్యాపేట : పట్టణంలోని మోరిశెట్టి అంతయ్య మెమోరియల్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 2005 – 06 పదో తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా కలుసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సరదాగా గడిపారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సమ్మేళనంలో ఉపాధ్యాయులు వై.వెంకటేశ్వర్లు, రమణాచారి, ఎం.సోమయ్య, వి.మంగయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

40ఏళ్ల తరువాత ఒకే వేదికపైకి..

జిల్లా కేంద్రంలోని సరస్వతి విద్యానిలయంలో 1985–86 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న 60మంది పూర్వ విద్యార్థులు ఆదివారం హైదరాబాద్‌లోని ఆరా విల్లా రిసార్ట్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎ.కృపాకర్, వి.నర్సింహారావు, ఎన్‌పీపీ సురేష్, ఎ.అంజు, కె.సురేందర్ రెడ్డి, జి.శ్రీధర్, భారతి, నివేదిత, జి.నిర్మల, ఎం.అనిత, శ్రీలత, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట : సమ్మేళనంలో పాల్గొన్న సరస్వతి విద్యానిలయం పూర్వవిద్యార్థులు

వినూత్న ప్రచారం

చిలుకూరు : యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ కోరారు. ఈమేరకు ఆదివారం చిలుకూరు మండల కేంద్రంలో వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనకు సెలవులు ఉన్న రోజుల్లో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. మద్యం, డ్రగ్స్ వద్దు.. ఆరోగ్యమే ముద్దు అనే ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ మైక్‌తో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కొండా రామాంజనేయులు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

రూ.3లక్షల ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న నాయకులు

తిరుమలగిరి : తాటిపాముల గ్రామానికి చెందిన బండెల ప్రమీల అనారోగ్యానికి గురై చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే మందుల సామేల్ సహకారంతో ఆమెకు రూ.3లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. ఆ ఎల్‌ఓసీని ఆదివారం స్థానిక నాయకులు బాధితురాలికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కోల రమేష్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నాగారం : ఇందిరమ్మ ఇళ్ల పనులకు మండల పరిధిలోని పసునూరు గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పది సంవత్సరాల పాలనలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోపే నిరుపేదలకు సొంతింటి కలను సకారం చేస్తోందని తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్, ఫ్రీ బస్సు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నజీర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు చిత్తలూరి వెంకటయ్య, మామిడి నాగయ్య, పొదిల నరేష్, కమటం శ్రీనివాస్, సంకటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.